


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



ఘనంగా
నారా రోహిత్ నిశ్చితార్థం
- హాజరైన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దంపతులు



3





తిరుమల బ్రహ్మోత్సవాలు, ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు..

## బాగా జరిపారు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు
- భక్తులు లక్షలాదిగా తరలివచ్చినా చిన్న ఇబ్బందీ రాలేదు
- అధికారులకు సీఎం చంద్రబాబు అభినందనలు
- మన సంస్కృతి, సంప్రదాయాల్లో పండుగలు అంతర్భాగం
- వాటి పవిత్రత కాపాడుకోవటం మనందరి బాధ్యత

4 లో



## నెరవేరిన యువగళం మరో హామీ

- రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి
- బీసీల ఆత్మగౌరవం పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు
- హామీలన్నీ నెరవేరుస్తాం
- మంత్రి లోకేష్ ఉద్ఘాటన

4 లో



## నేటి నుంచి 'పల్లె పండుగ' !

- 20 వరకు పంచాయతీల్లో వారోత్సవాలు
- ప్రగతి పథంలో రాష్ట్ర పల్లెలు.. అజెండాగా కార్యాచరణ
- నేడు కంకిపాడులో పాల్గొననున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

5 లో

## ప్రజలపై భారం పడొద్దు

- నిత్యావసరాల ధరలు నియంత్రించాలి
- బ్లాక్ మార్కెటీర్లపై కఠిన చర్యలు
- ధరల పెరుగుదలపై నిరంతర పర్యవేక్షణతో సత్ఫలితాలు
- పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయం అవసరం
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



2లో

## లాటరీకి వేళాయె.. కిక్కు దక్కేదెవరికో !

- రాష్ట్రంలో మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు
- 3396 షాపులకు రికార్డ్ స్థాయిలో 89,882 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.1797.64 కోట్ల ఆదాయం
- అతి తక్కువగా దరఖాస్తులు వచ్చిన చోట పునఃపరిశీలన
- ఈసారి విదేశాల నుంచీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- నేడు మద్యం దుకాణాల కోసం లాటరీ
- 15న దుకాణాలకు అనుమతి
- 16నుంచి అమల్లోకి నూతన మద్యం విధానం

5 లో



## సీఎం చంద్రబాబును కలిసిన మెగాస్టార్ చిరంజీవి

- వరద సాయం కింద రూ. కోటి విరాళం అందజేత
- ముఖ్యమంత్రి సాదర స్వాగతం
- కారు వరకూ వెళ్లి వీడ్కోలు
- మానవతా సాయంలో ముందుంటారని ప్రశంసలు

3 లో





## రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు

ప్రభుత్వం అప్రమత్తం 2

## వెంటాడుతున్న గత ప్రభుత్వ పాపాలు

- గంజాయి మత్తులో ఘోరాలు
- మంత్రి సవిత మండిపాటు
- గ్యాంగ్ రేప్ బాధితులకు పరామర్శ

5లో



# ప్రజలపై భారం పడొద్దు

- **నిత్యావసరాల ధరలు నియంత్రించాలి**
- **బ్లాక్ మార్కెటీర్లపై కఠిన చర్యలు**
- **ధరల పెరుగుదలపై నిరంతర పర్యవేక్షణతో సత్ఫలితాలు**
- **పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయం అవసరం**
- **సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి (చైతన్యరథం): నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నిత్యావసర వస్తువుల ధరల భారం ప్రజలపై పడకుండా పౌరసరఫరాల శాఖ తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం సమీక్షించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా సాధ్యమైనంత వరకు ప్రజలపై నిత్యావసరాల భారం పడకుండా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. డిమాండ్-సప్లయి మధ్య వ్యత్యాసానికి గల కారణాలను విశ్లేషించి తగు చర్యలు చేపట్టాలన్నారు. ధరలు పెరిగిన తరువాత తగ్గించే ప్రయత్నం చేయడం, సబ్సిడీలో అందించడం కంటే.... మూడు శాఖలు నిరంతర పర్యవేక్షణ ద్వారా ధరల పెరుగుదలను ముందుగానే గ్రహించి అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో పౌరసరఫరాల, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఫలితాలు వస్తాయన్నారు.

నిత్యావసర వస్తువుల ధరల భారం తగ్గించేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను సీఎంకు అధికారులు వివరించారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు తాత్కాలికంగా, దీర్ఘకాలికంగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమీక్షలో మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆన్‌లైన్ విధానంలో హాజరయ్యారు. ప్రస్తుతం రైతు బజార్లలో కౌంటర్ల ద్వారా చేపట్టిన అమ్మకాలపై సమీక్షలో వివరించారు. రైతు బజార్‌ల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, కందిపప్పు, టమోటా, ఉల్లిపాయలు మార్కెట్ ధర కంటే రూ.10 నుంచి రూ.15 తక్కువకు అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపారు.

విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ క్రియాశీలకంగా పనిచేయాలని, వ్యాపారులు కూడా సహకరించేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన రాష్ట్రంలో పామాయిల్, కూరగాయలు, పప్పుల వంటి ఉత్పత్తులు పెంచేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున గిడ్డంగులను అందుబాటులోకి తేవడం ద్వారా రైతులకు, వినియోగదారులకు కూడా న్యాయం చేయవచ్చని సీఎం సూచించారు. ధరల నియంత్రణ విషయంలో ప్రజలకు ఉపశమనం కల్పించేలా చర్యలు ఉంటేనే వారు హర్షిస్తారని....ఆ స్థాయిలో అధికారులు ప్రణాళికలను అమలు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు.





అందరి సమన్వయంతో..

## ఘనంగా దసరా ఉత్సవాలు

- **లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించారు**
- **సామాన్య భక్తులకు ప్రశాంతంగా అమ్మవారి దర్శనం**
- **సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ విలువైన సూచనలు చేశారు**
- **సంతోషం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి**



విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి దసరా ఉత్సవాలను ఇంద్రకీలాద్రిపై అత్యంత ఘనంగా నిర్వహించామని విజయవాడ వెస్ట్ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ఇంద్రకీలాద్రి పై తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించానన్నారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్, నగర పోలీసు కమిషనర్, దేవస్థానం ఈఓ సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు విజయవంతం చేశారని అభినందించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కూడా ప్రతి రోజు ఏర్పాట్లు పరిశీలించి తగు చర్యలు తీసుకున్నారు. చిన్న చిన్న సమస్యలు తప్పించి.. ఉత్సవాలు బాగా విజయవంతంగా జరగడం ఆనందంగా ఉంది. కొన్ని స్వల్ప లోపాలను గుర్తించాను. వచ్చే ఏడాది వాటిని పునరావృతం కాకుండా సరి చేస్తాం. ప్రతి ఏడాది తాత్కాలిక ఏర్పాట్లు చేసి మళ్లీ తొలగిస్తున్నారు. ఈసారి పర్మినెంట్ క్యూ లైన్ల తో పాటు కొన్ని శాశ్వత ఏర్పాట్లు చేసేందుకు ఆలోచన చేస్తున్నాం. కొండ పైకి అనవసర వాహనాల రాకపోకలు ఆపడం వల్ల అనేక ఇబ్బందులు తొలగించాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం సూచనలు కూడా ఈ ఉత్సవాల విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడ్డాయి. ఒకవైపు కొండ పైకి, మరో వైపు నుంచి కిందకి దిగేలా మార్గాలు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నాం. వచ్చే దసరా నాటికి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు ఉంటాయి. సామాన్య భక్తులు ఈసారి ప్రశాంతంగా అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఎక్కడా ఎటువంటి గందరగోళం లేకుండా ఈ ఏడాది కొండపై దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అధికారులు, పాలకులు కూడా సమన్వయం తో పని చేశారు. వీఐపీ, వీవీఐపీ లకు స్లాట్ లు ఇచ్చి ప్రత్యేక సమయం కేటాయించడంతో రద్దీ ఉన్నా సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూశాం. దుర్గగుడి అభివృద్ధికి ఆ ప్రాంత ఎమ్మెల్యేగా నా వంతు కృషి చేస్తా. సూచనలు, సలహాలు, అభిప్రాయాలను అందిస్తే వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటామని ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పష్టం చేశారు.

## రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు

### ప్రభుత్వం అప్రమత్తం




అమరావతి (చైతన్యరథం): ఈ నెల 14 నుంచి 17 వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే సూచనలతో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోందని విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. విపత్తుల నిర్వహణ శాఖ నిరంతరం అప్రమత్తతగా ఉంటోందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్ష సూచనలున్న జిల్లాల కలెక్టర్లకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్ళవద్దని హెచ్చరించారు. ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాల కారణంగా ఈ నెల 14 నుంచి 17 వరకు కోస్తా, రాయలసీమలో భారీవర్షాలు, తీరం వెంబడి 40 నుండి 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.


ఆగ్నేయ బంగాళాఖాతాన్ని ఆనుకుని హిందూ మహాసముద్రం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయవ్య దిశగా కదిలి ఆదివారం మరింత విస్తరించింది. దీని ప్రభావంతో సోమవారం దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. ఇది క్రమేపీ పశ్చిమ వాయవ్య దిశగా ఏపీ దక్షిణ కోస్తా తీరం వైపు పయనించే అవకాశాలున్నాయని ఐఎండీ పేర్కొంది. దీని ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది.

ముఖ్యంగా, ఏపీ దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వివరించింది. ఈ నెల 17న ఉత్తరాంధ్ర, యానాంలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ఆనంద్ దీనిపై స్పందించారు. నెల్లూరు జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. 0861-2331261, 7995576699, 1077 నెంబర్ల ద్వారా కంట్రోల్ రూమ్ ను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని డివిజన్లు, మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్టు వివరించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. భారీ వర్షాలతో వరదలు వచ్చే అవకాశం ఉన్నందున... రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పెన్నా నది గట్లను పరిశీలించాలని ఆదేశించారు. తీరప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

చైతన్యరథం

# సీఎం చంద్రబాబును కలిసిన మెగాస్టార్ చిరంజీవి



- వరద సాయం కింద రూ.కోటి విరాళం అందజేత
- ముఖ్యమంత్రి సాదర స్వాగతం
- కారు వరకూ వెళ్లి వీడ్కోలు
- మానవతా సాయంలో ముందుంటారని ప్రశంసలు

హైదరాబాద్ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రముఖ సినీ హీరో, మెగాస్టార్ చిరంజీవి కలిశారు. ఏపీలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి తన తరపున రూ.50 లక్షలు, తన తనయుడు, హీరో రామ్ చరణ్ తరపున రూ.50 లక్షల విరాళం అందించారు. రూ.కోటి విరాళం అందించిన చిరంజీవి, ఆయన తనయుడు రామ్‌చరణ్‌లకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. విరాళం చెక్కులు అందించేందుకు తన నివాసానికి వచ్చిన చిరంజీవికి సాదర స్వాగతం పలికిన సీఎం చంద్రబాబు నాయుడు.. భేటీ అనంతరం కారు వరకూ వెళ్లి వీడ్కోలు పలికారు.

తరువాత దీనిపై సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. చిరంజీవి తనను కలిసిన ఫొటోలను చంద్రబాబు షేర్ చేస్తూ... మానవతాసేవలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారని ప్రశంసించారు. విపత్తు సమయాల్లో తప్పకుండా తన మద్దతు అందిస్తుంటారు. వరదల వల్ల నష్టపోయిన బాధితుల జీవితాలను పునర్నిర్మించేందుకు చిరంజీవి, రామ్ చరణ్ అందించిన సహకారం ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

కాగా సీఎం చంద్రబాబు చేసిన పోస్ట్‌పై మెగాస్టార్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. నాపై మీరు చూపిన అభిమానానికి ధన్యవాదాలు.. వరదలు వంటి భారీ విపత్తు సంభవించినప్పుడు మన సొంతవారికి సహాయం చేయడం మా కర్తవ్యం. ఇలాంటి పరిస్థితుల్లో మీ నాయకత్వం ఎంతో ఆదర్శనీయం.. అని ట్వీట్ చేశారు.







# ఘనంగా నారా రోహిత్ నిశ్చితార్థం



## - హాజరైన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దంపతులు

హైదరాబాద్ (చైతన్యరథం): హీరో నారా రోహిత్, హీరోయిన్‌గా ప్రతినిధి 2 సినిమాలో నటించిన శిరీష లేళ్ల నిశ్చితార్థం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్లో ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. ఏపీ సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు నిశ్చితార్థానికి హాజరయ్యారు. నందమూరి, నారా కుటుంబాలకు చెందిన వారంతా ఈ నిశ్చితార్థానికి హాజరయ్యారు.

సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడి కుమారుడు అయిన నారా రోహిత్ పదిహేనేళ్ల కిందట బాణం సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. టాలెంటెడ్ నటుడిగా గుర్తింపు పొందారు. నారా రోహిత్ ప్రస్తుతం సుందరకాండ అనే సినిమాలో నటిస్తున్నారు. నారా రోహిత్ రాజకీయ అంశాల పట్ల కూడా ఆసక్తిగా ఉంటారు. టీడీపీ తరపున చురుకుగా ప్రచారం చేస్తుంటారు. టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పూర్తిగా కుటుంబ కార్యక్రమంగానే నిశ్చితార్థాన్ని నిర్వహించారు.











చైతన్యరథం

# లాటరీకి వేళాయే..

# కిక్కు దక్కేదెవరికో!



- రాష్ట్రంలో మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు
- 3396 షాపులకు రికార్డ్ స్థాయిలో 89,882 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.1797.64 కోట్ల ఆదాయం
- అతి తక్కువగా దరఖాస్తులు వచ్చిన చోట పునఃపరిశీలన
- ఈసారి విదేశాల నుంచీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- నేడు మద్యం దుకాణాల కోసం లాటరీ
- 15న దుకాణాలకు అనుమతి
- 16నుంచి అమల్లోకి నూతన మద్యం విధానం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మద్యం దుకాణాల కేటాయింపుల కోసం సోమవారం లాటరీ నిర్వహించనున్నారు. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారికి 15న షాపులు కేటాయిస్తారు. 16వ తేదీ నుంచి దుకాణాల్లో అమ్మకాలు సాగించవచ్చు. ఆ రోజు నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుంది. ఈ సారి రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. 3396 మద్యం షాపుల కోసం మొత్తం 89,882 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దరఖాస్తుల ద్వారా ఏపీ ప్రభుత్వానికి ఏకంగా రూ.1797.64 కోట్ల ఆదాయం వచ్చింది.

అక్టోబర్ 16 నుంచి రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానించగా రికార్డుస్థాయిలో వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా దాఖలైన దరఖాస్తుల ప్రకారం షాపునకు సగటున 25నుంచి 26 అప్లికేషన్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా, అల్లూరి జిల్లాలో అత్యల్పంగా దరఖాస్తులు దాఖలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు గరిష్ఠంగా 5,800 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా పరిధిలో ప్రతి షాపునకూ 50నుంచి 51 దరఖాస్తులను టెండర్ దారులు దాఖలు చేశారు. అనంతపురం జిల్లాలో 12 దుకాణాలకు అతి తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో వీటిని పునఃపరిశీలించాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

ఈసారి విదేశాల నుంచీ ఆన్‌లైన్‌లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు పెద్దఎత్తున వచ్చాయి. అయితే దరఖాస్తుల తొలిదశలో ఎక్కడికక్కడ భారీఎత్తున ఏర్పడిన మద్యం సిండికేట్లు దరఖాస్తులు పెద్దగా పడకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు హెచ్చరించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ స్థాయిలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు రావడం ఇదే తొలిసారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అక్టోబర్ 14న మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఎక్సైజ్ అధికారులు లాటరీ నిర్వహిస్తారు. అందులో మద్యం షాపులు వచ్చిన వారికి ఈనెల 15న దుకాణాలకు అనుమతి అందజేస్తారు. దీంతో ఈనెల 16నుంచి నూతన మద్యం విధానం ఏపీలో అమల్లోకి వస్తుంది. అన్ని రకాల బ్రాండ్లకు చెందిన చీప్ లిక్కర్‌ను రూ.99కే అందివ్వనున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇప్పటికే తెలిపింది.

# వెంటాడుతున్న గత ప్రభుత్వ పాపాలు



- గంజాయి మత్తులో ఘోరాలు
- మంత్రి సవిత మండిపాటు
- గ్యాంగ్ రేప్ బాధితులకు పరామర్శ
- కూటమి ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతోందని స్పష్టీకరణ

హిందూపురం (చైతన్యరథం): గత ప్రభుత్వ పాపాలు, వైఫల్యాల కారణంగానే నేడు రాష్ట్రంలో ఘోరాలు జరుగుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత మండిపడ్డారు. తగ ఐదేళ్లలో రాష్ట్రాన్ని గంజాయికి కేంద్రంగా మార్చారని, ఆ మత్తుకు బానిసలైన నేరస్థులు అనేక దారుణాలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న వైసీపీ వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు.

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం నల్లబొమ్మిని పల్లి గ్రామ సమీపంలో ఉపాధి కోసం వలస వచ్చి దుండగుల చేతిలో అత్యాచారానికి గురైన అత్తాకోడళ్లను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మంత్రి సవితమ్మ ఆదివారం పరామర్శించి దైర్యం చెప్పారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అనంతరం మీడియాతో మంత్రి సవితమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వగలపూడి అనిత, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో పాటు, తామంతా ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నామన్నారు. అమాయక మహిళలపై అతి దారుణంగా అఘాయిత్యం జరిగింది, గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గత ఐదేళ్లలో గంజాయిని ప్రోత్సహించింది ఎవరో అందరికీ తెలుసు. గంజాయి వల్ల యువత పెడదారి పడుతోంది. గంజాయి మత్తులో దారుణాలకు పాల్పడుతున్నారని మంత్రి సవిత అన్నారు.

రాష్ట్రంలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం గంజాయిపై ఉక్కు పాదం మోపుతోందని మంత్రి సవిత తెలియచేసారు. అదేవిధంగా ఘటన జరిగి 24 గంటలు గడవక ముందే పోలీస్‌లు నలుగురు నిందితులను పట్టుకున్నారన్నారు. ఘటనలో పాల్గొన్న వారంతా గంజాయికి అలవాటు పడినవారని, అనేక కేసుల్లో నిందితులుగా ఉండి, జైళ్లకు కూడా వెళ్ళొచ్చారని పోలీసుల విచారణలో తెలుస్తోందన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, రాష్ట్ర కార్యదర్శి రామాంజినమ్మ, హిందూపురం పట్టణ అధ్యక్షుడు డీఈ రమేష్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంతకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఘటనపై శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీతో మాట్లాడి దర్యాప్తు వివరాలు తెలుసుకున్నారు. నిందితులను వెంటనే పట్టుకోవాలని ఆదేశించారు. ఉపాధి కోసం బళ్లారి నుంచి వచ్చిన ఈ కుటుంబం.. ఒక నిర్మాణం వద్ద వాచ్‌మెన్, ఇతర విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు దుండగులు కత్తులతో బెదిరించి అత్తాకోడళ్లపై అత్యాచారానికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన తండ్రీకొడుకులపై దాడి చేశారు.

# ఆ కేసులు సీఐడీకి!

- టీడీపీ కేంద్ర కార్యాలయంపై, సీఎం చంద్రబాబు ఇంటిపై దాడి ఘటనలు



అమరావతి(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి, అలాగే ఉండవల్లిలోని అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నివాసంపై దాడి కేసులను సీఐడీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేసుల విచారణ వేగవంతం కోసం సీఐడీకి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ కేసుల విచారణకు సంబంధించిన ఫైళ్లను మంగళగిరి డీఎస్పీ. సీఐడీకి అప్పగించనున్నారు. ప్రస్తుతం ఈ కేసులకు సంబంధించి మంగళగిరి, తాడేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళగిరి డీఎస్పీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. సివిల్ పోలీసుల ద్వారా విచారణ ఆలస్యం అవుతుందనే భావనతో విచారణను వేగవంతం చేసేందుకు సీఐడీకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

టీడీపీ కేంద్రకార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు తరలించారు. మరికొందరు నేతలను కూడా విచారించనున్నారు. అలాగే ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంపై దాడి కేసులో మాజీ మంత్రి జోగి రమేష్‌ను పోలీసులు విచారణకు పలుమార్లు పిలిచారు. ఆయన సహకరించలేదు. దీంతో ఈ కేసులను సివిల్ పోలీసుల కంటే సీఐడీకి అప్పగిస్తే త్వరగా విచారణ జరుగుతుందని భావించి ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

కాగా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ నేతలు దేవినేని అవినాష్, అప్పిరెడ్డి, నందిగం సురేష్, తలశిల రఘురామ్ సహా మరో పలువురు నిందితులుగా ఉన్నారు. అధికారం చేతిలో ఉంది కదా అని అప్పట్లో వీరంతా ఇష్టానుసారంగా రెచ్చిపోయారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడటమే కాకుండా ఆ ప్రాంతంలో వీరంగం సృష్టించారు.

సీఎం చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో నిందితులుగా ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి జోగిరమేశ్, ముందస్తు బెయిల్ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. విచారణకు సహకరించాలని జోగిరమేశ్‌కు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. అయితే తదుపరి ఉత్తర్వుల ఇచ్చే వరకు ఎలాంటి చర్యలు వద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే పాస్‌పోర్టు సరెండర్ చేయాలని, దర్యాప్తునకు సహకరించాలని, ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తునకు సహకరించపోతే రక్షణ ఉండదని ధర్మాసనం స్పష్టం చేసింది.



# నేటి నుంచి 'పల్లె పండుగ'!

- 20 వరకు పంచాయతీల్లో వారోత్సవాలు
- ప్రగతి పథంలో రాష్ట్ర పల్లెలు.. అజెండాగా కార్యాచరణ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సోమవారం నుంచి 'పల్లె పండుగ' కార్యక్రమం ప్రారంభమవుతోంది. 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల' పేరుతో ఈ నెల 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. పల్లె పండుగతో రాష్ట్ర పల్లెలు ప్రగతి పథంలో పయనించనున్నాయి. గత ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభల్లో చేసిన తీర్మానాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించారు. సోమవారం కృష్ణాజిల్లా కంకిపాడులో జరిగే 'పల్లె పండుగ'లో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పాల్గొంటారు.

ఈ కార్యక్రమంలో భాగంగా.. గ్రామాల్లో నివాసముంటున్న కుటుంబాలకు ఏడాదిలో 100 రోజులు వేతన ఉపాధి కల్పించడం, శాశ్వత ఆస్తులు ఏర్పాటు చేసి జీవనోపాధులు మెరుగుపరచడం, రూ.4,500 కోట్లు నిధులతో 30 వేల పనులు చేపట్టటం, 3000 కిలోమీటర్ల మీద సిమెంట్ రోడ్ల నిర్మాణం, 500 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణం, 25 వేల గోకులాలు, పదివేల ఎకరాలు నీటి సంరక్షణ ట్రెంచుల ఏర్పాటు.. అజెండాగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

చైతన్యరథం



# మూడోరోజు నారీశక్తి విజయోత్సవ సంరంభం

## బబ్బూరు గ్రౌండ్స్‌లో ఆధ్యాత్మిక శోభ - ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు







విజయవాడ (చైతన్యరథం): నారీ శక్తి విజయోత్సవంలో భాగంగా మూడో రోజు విజయవాడ పున్నమి ఘాట్ బబ్బూరి గ్రౌండ్స్ లో నిర్వహించిన కార్యక్రమాలు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయి. నారీశక్తి విజయోత్సవంతో ఆదివారం ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో అలరారింది. కళాకారులు ప్రదర్శించిన వివిధ కళా రూపాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అబ్బుర పరచాయి.

గిరిజన సాంప్రదాయ కొమ్ము నృత్యం: గిరిజనుల్లో ప్రత్యేకించి కోయ జాతివారు మాత్రమే తలపై గేదె కొమ్ములు తగిలించుకొని, మెడల్లో పెద్దడోలు వేసుకుని ఆడే ఈ ఆటకు 'కొమ్ము - డోలు' ఆట అని పేరు.. కోయ జాతి పురుషులు, స్త్రీలు, చిన్నాపెద్దా, ముదుసలి, అనే తారతమ్యం లేకుండా ఒకరిచేతులు ఒకరు పట్టుకొని దండ కట్టి 'రేల' అనే పదంతో విన్యాసాలు చేస్తారు.. డోలును ఒకవైపు పుల్లతోను, మరొకవైపు చేతితోను వాయిస్తారు. ఇలా గెంతుతూ వాయిస్తూ వుంటే ఆ వాద్యానికి అనుగుణంగా లయ బద్ధంగా స్త్రీలు నాట్యం చేస్తారు.

శివసత్తుల పూనకాలు - పోతురాజుల విన్యాసాలు: పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోతురాజుల వేషధారణతో ఎంతో భక్తి పారవశ్యంతో ప్రదర్శించిన పోతురాజుల విన్యాసాలు బబ్బూరు గ్రౌండ్‌కు వచ్చిన ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి..

జానపద దప్పు నృత్యం: శతాబ్దాలుగా కళాకారులు జానపద దప్పు నృత్యంతో ప్రజలకు వినోదాన్ని అందిస్తున్నారు. విభిన్నమైన భంగిమల్లో కళాకారులు నృత్యం చేస్తూ, ఒకరిపై ఒకరు ఎత్తుగా పైకెక్కి పిరమిడ్ ఆకారంగా నిలబడి, జానపద, భక్తి పాటలు పాడుతూ ప్రజలను ఆనందింపచేశారు. ఒకవైపు నృత్యం మరోవైపు జానపద దప్పు వాయిద్యం వాయిస్తూ ప్రజలను ఆహ్లాదపరచారు.











# పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

విజయనగరం, చైతన్యరథం: శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాల్లో భాగంగా పలువురు ప్రముఖులు పైడితల్లి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉత్సవాలను ప్రారంభించేందుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు అమ్మవారిని దర్శించుకున్నారు. స్పీకర్‌కు ఆలయ ఈవో ప్రసాదరావు తదితరులు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను బహూకరించారు. స్పీకర్ వెంట రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసనసభ్యురాలు అదితి గజపతి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ప్రసాదరావు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను బహూకరించారు.





## శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన కార్పొరేషన్ చైర్మన్ పీలా

అనకాపల్లి, చైతన్యరథం: ఇటీవల ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు పీలా గోవింద సత్యనారాయణ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుని ఆదివారం నర్సీపట్నంలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. తన నియామకం కోసం కృషిచేసిన అయనను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో మౌలిక వసతుల పెంపు కోసం జరుగుతున్న ప్రణాళికలను స్పీకర్‌కు వివరించారు. రాష్ట్రంలో అర్బన్ ఫైనాన్స్ వాడకం, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, ప్రాజెక్టుల అమలు తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కార్యకర్తలకు అండగా ఉంటాం

◆ రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, చైతన్యరథం: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి అన్నారు. వైసీపీ రౌడీమూకల చేతిలో గాయపడ్డ అడ్డతీగల మండలం డి.భీమవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చెక్కా అప్పారావురెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాడికి పాల్పడిన వైసీపీ రౌడీలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల మండల ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




## యువగళంలో ఇచ్చిన మరో హామీ నెరవేర్చిన మంత్రి నారా లోకేష్

◆ 17న రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

బీసీల ఆత్మగౌరవం పెంచేలా ప్రభుత్వం అడుగులు

◆ బోయ, వాల్మీకి సాధికార సమితి

రాష్ట్ర కన్వీనర్ పూల నాగరాజు

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మరో హామీని చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చింది. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని బోయ, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పూల నాగరాజు, వాల్మీకి వివిధ సంఘాల నాయకులు పాదయాత్రలో కలిసి విన్నవించారు. వారి విజ్ఞప్తిని గౌరవిస్తూ వాల్మీకి జయంతిని ఈనెల 17వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అదేరోజు అనంతపురంలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతిని నిర్వహిస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీల పుట్టినిల్లు అని, వారి ఆత్మ గౌరవాన్ని పెంచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని నాగరాజు తెలిపారు.



# ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య

◆ఇద్దరు నిందితుల అరెస్ట్

◆హత్య వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం





ముంబయి: ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం సీనియర్ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ ముంబైలో హత్యకు గురయ్యారు. బాబా సిద్ధిఖీ తన కుమారుడి కార్యాలయం వెలుపల ఉండగా, శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ముగ్గురు షూటర్లు ఆయనపై ఆరుసార్లు కాల్పులు జరిపారు. దీంతో తీవ్రంగా గాయపడిన బాబా సిద్ధిఖీని సమీపంలోని లీలావతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీంతో అక్కడ ఆయన చనిపోయినట్లు ధృవీకరించారు. అయితే బాబా సిద్ధిఖీ మరణ వార్తను తెలుసుకున్న బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ బిగ్ బాస్ 18 షూటింగ్ రద్దు చేసుకుని రాత్రికి రాత్రే భారీ భద్రత నడుమ లీలావతి ఆస్పత్రికి చేరుకున్నారు.

సల్మాన్ ఖాన్‌తో పాటు, సీఎం షిండే, అజిత్ పవార్, శిల్పాశెట్టి కుంద్రా బాబా సిద్ధిఖీ కుటుంబాన్ని పరామర్శించేందుకు లీలావతి ఆస్పత్రికి వెళ్లారు.

ముంబై రాజకీయాల నుంచి బాలీవుడ్ వరకు బాబా సిద్ధిఖీ ప్రభావం ఉంది. బాబా సిద్ధిఖీ ముంబై సినీ ప్రపంచంలో కూడా బాగా పాపులర్ అయ్యారు. రంజాన్ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన ఇఫ్తార్ పార్టీలకు సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్ వంటి నటులు గతంలో హాజరయ్యారు. అంతేకాదు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అజిత్ పవార్ కీలక వ్యూహకర్తగా కూడా బాబా సిద్ధిఖీని చూస్తున్నారు.

బాబా సిద్ధిఖీ రాజకీయ జీవితం గురించి మాట్లాడితే ఆయన 1999, 2004, 2009లో వరుసగా మూడు సార్లు బాంద్రా వెస్ట్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ క్రమంలో 2004 నుంచి 2008 వరకు ఆహార, పౌర సరఫరాలు, కార్మిక మంత్రిగా కూడా పనిచేశారు. బాబా సిద్ధిఖీ తన మొత్తం రాజకీయ జీవితాన్ని (సుమారు 48 సంవత్సరాలు) కాంగ్రెస్ పార్టీలో గడిపారు. విద్యార్థి దశలోనే 1977లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన కాంగ్రెస్‌ను వీడారు. ఆయన కుమారుడు జీషన్ సిద్ధిఖీ ప్రస్తుతం బాంద్రా తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు.

ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్ధిఖీ హత్య కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన కర్నైల్ సింగ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ కశ్యప్ అనే ఇద్దరు నిందితులు తాము లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందినవారమని పేర్కొన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. బాంద్రా ఈస్ట్‌లోని షూటింగ్ స్పాట్‌లో వీరు దాదాపు నెల రోజులపాటు రెక్కీ నిర్వహించినట్లు చెప్పారని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయంపై బిష్ణోయ్ గ్యాంగ్ ఎటువంటి ప్రకటన చేయలేదు. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ కాల్పుల ఘటన రాజకీయ వర్గాల్లో భద్రతాపరమైన ఆందోళనలను రేకెత్తిస్తోంది.

కాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులకు పాల్పడింది. గత కొంతకాలంగా సల్మాన్‌ను టార్గెట్ చేసిన బిష్ణోయ్ గ్యాంగ్.. అతడి స్నేహితుడైన బాబా సిద్ధిఖీని హత్య చేయడంతో పలు అనుమానాలకు దారి తీస్తోంది. అయితే బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి సిద్ధిఖీకి ఎటువంటి బెదిరింపులు రాలేదని పోలీసులు పేర్కొన్నారు. ఇతర కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### 15 రోజుల క్రితమే 'వై' కేటగిరీ భద్రత

బాబా సిద్ధిఖీకి ప్రాణహాని ఉందని ఆయన సన్నిహితులు పేర్కొనడంతో 15 రోజుల క్రితమే ఆయనకు 'వై' కేటగిరీ భద్రత కల్పించినట్లు పోలీసులు పేర్కొన్నారు. భద్రత ఉన్న రాజకీయ నాయకుడికే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రతిపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రాష్ట్రంలో శాంతి భద్రతలు పతనమయ్యాయి: రాహుల్ గాంధీ

ఎన్సీపీ నేత సిద్ధిఖీ హత్య ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. "ఈ హత్య చాలా బాధాకరమైన విషయం. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు మద్దతుగా ఉంటాం. ఈ ఘటన చూస్తుంటే మహారాష్ట్రలో శాంతిభద్రతలు పూర్తిగా పతనమయ్యాయని స్పష్టమవుతోంది. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలి" అని సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

శనివారం సాయంత్రం ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా బాబా సిద్ధిఖీపై ముగ్గురు దుండగులు మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. వెంటనే ఆయనను లీలావతి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. చాలా కాలంపాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న సిద్ధిఖీ కొన్ని నెలల కిందట ఎన్సీపీలో చేరారు.

# గతిశక్తితో విప్లవాత్మక మార్పు

◆ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి గతిశక్తి ప్రాజెక్టు గురించి ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. మౌలిక సదుపాయాలలో విప్లవాత్మక మార్పు తీసుకురావడమే లక్ష్యంగా గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌ను తీసుకువచ్చామని పేర్కొన్నారు. దీని ద్వారా దేశం అన్ని మౌలిక రంగాల్లో మరింత వేగంగా, సమర్థవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. వివిధ ఆర్థిక ప్రణాళికలకు బహుళ-మోడల్ కనెక్టివిటీ మౌలిక సదుపాయాలను అందించడం కోసం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌ను 2021, అక్టోబర్ 13న అమల్లోకి తీసుకువచ్చారు. దీనిని ప్రారంభించి మూడేళ్లు అయిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ గతిశక్తి దేశంలోని రైల్వే, రోడ్లు, ఓడరేవులు, జలమార్గాలు, విమానాశ్రయాలు, లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి వాటి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని మరింత వేగంగా చేరుకునేందుకు గతిశక్తి ఉపయోగపడుతుందన్నారు. మరిన్ని నూతన ఆవిష్కరణలను సైతం ప్రోత్సహిస్తోందని తెలిపారు.

# 16న జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం!



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారు అయినట్లు సమాచారం. ఈనెల 16వ తేదీన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు చేపట్టనున్నారని తెలిసింది. అయితే సీఎం అభ్యర్థి ఒమర్ అబ్దుల్లా విలేకర్లతో మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అమలులో ఉందని గుర్తు చేశారు. దీనికి ముగింపు పలికేందుకు కేబినెట్ నోట్ తయారు చేయాల్సి ఉందన్నారు. ఈ నోట్‌ను రాష్ట్రపతి భవన్‌తోపాటు కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సైతం పంపిస్తామన్నారు. అందుకు సంబంధించిన ప్రక్రియ సోమవారం పూర్తవుతుందని తెలిపారు. అనంతరం సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. అన్ని సవ్యంగా జరిగితే బుధవారం అంటే అక్టోబర్ 16వ తేదీన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతానని ఆయన తెలిపారు. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఇటీవల మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 8వ తేదీన వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ కూటమికి ఆ రాష్ట్ర ఓటరు పట్టం కట్టారు.

నేషనల్ కాన్ఫరెన్స్ కూటమికి 42 స్థానాలు, కాంగ్రెస్ పార్టీ 6 స్థానాలు గెలుచుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు తమను అనుమతించాలంటూ జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను సీఎం అభ్యర్థి ఒమర్ అబ్దుల్లా భేటీలో వెల్లడించారు. అలాగే తమతోపాటు సీపీఐ(ఎం), ఆప్, స్వతంత్ర అభ్యర్థులు సైతం తమ వెంట ఉన్నారని ఎల్జీకి ఒమర్ అబ్దుల్లా వివరించారు.

### కోల్‌కతా ఆర్‌జీ కర్ వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటన

# రాజీనామా బాటలో మరో 77 మంది వైద్యులు




కోల్‌కతా: ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కుదిపేస్తోంది. ఈ ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలంటూ జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు అపూర్వ మద్దతు లభిస్తోంది. ఇప్పటికే ఆర్జీ కర్ ఆస్పత్రి సహా పలు ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన దాదాపు 200 మందికి పైగా సీనియర్ వైద్యులు తమ సంఘీభావం ప్రకటించి మూకుమ్మడిగా రాజీనామాలు చేయగా.. తాజాగా మరో 77 మంది వైద్యులు అందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు కల్యాణి జేఎన్‌ఎం ఆస్పత్రికి చెందిన 77 మంది వైద్యులు పశ్చిమ బెంగాల్ ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రారు పంపిన ఈ- మెయిల్‌లో తమ నిర్ణయాన్ని వెల్లడించారు.. అక్టోబర్ 14 వరకు గడువు ఇస్తున్నామని, ఈలోగా డిమాండ్లు పరిష్కరించకపోతే తమ విధులను నిలిపివేస్తామని హెచ్చరించారు.

జూనియర్ వైద్యుల నిరవధిక నిరాహార దీక్షకు సంఘీభావం తెలపడంతో పాటు వారి ఆరోగ్యం క్షీణిస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైద్యులు రిజిస్ట్రారు పంపిన ఈ-మెయిల్లో పేర్కొన్నారు. అలాగే, పనిచేసేచోట తాము ఎదుర్కొంటున్న మానసిక ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితుల్లో పనిచేయలేకపోవడం వెనుక ఉన్న కారణాలను సైతం ప్రస్తావించారు. జూనియర్ వైద్యుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ కనబడకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం చేయడంతో పాటు ఆరోగ్య కార్యదర్శి ఎన్.ఎస్.నిగంను తక్షణమే తొలగించడం, పనిచేసే చోట భద్రతాచర్యలు తీసుకోవడం వంటి డిమాండ్లను అక్టోబర్ 14లోగా పరిష్కరించాలని.. లేదంటే అధికారికంగా తాము మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఇదే అంశంపై ఇప్పటికే పలువురు వైద్యులు మూకుమ్మడి రాజీనామాలు పంపగా.. అవి చెల్లవని ప్రభుత్వం శనివారం ప్రకటించింది. సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా వ్యక్తిగతంగా వైద్యులు రాజీనామా చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

# ప్రభుత్వ భూములు వెనక్కి ఇవ్వనున్న ఖర్గే కుటుంబం!

◆ వెంటాడుతున్న ముడా స్కాం

బెంగళూరు: కర్ణాటకలో ముడా స్కాం ప్రకంపనలు సృష్టిస్తున్న వేళ. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కుటుంబం కీలక నిర్ణయం తీసుకుంది. ఖర్గే కుటుంబానికి చెందిన సిద్ధార్థ విహార్ ట్రస్టుకు గతంలో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) కేటాయించిన ఐదు ఎకరాల భూమిని తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నట్లుగా సమాచారం.

ప్రస్తుతం మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా) స్కాంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఖర్గే కుటుంబం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. రాహుల్ ఖర్గే నేతృత్వంలోని సిద్ధార్థ విహార్ ట్రస్టుకు గతంలో కర్ణాటక ప్రభుత్వం బగలూరులోని హైటెక్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పార్క్ హార్డ్వేర్ సెక్టార్‌లో ఐదెకరాల భూమిని మంజూరు చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తోందని బీజేపీ నేత అమిత్ మాలవీయ విమర్శించారు.

కర్ణాటక ప్రభుత్వం ఐదెకరాల భూమిని సిద్ధార్థ విహార్ ట్రస్టుకు కేటాయించింది. ట్రస్ట్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, ఆయన అల్లుడు రాధాకృష్ణ, కుమారుడు రాహుల్ ఖర్గే మొదలైనవారు ట్రస్టీలుగా ఉన్నారు. అయితే ఈ స్థలం కేటాయింపులో అవకతవకలు, అవినీతి జరిగిందని ఆరోపిస్తూ దినేష్ కల్లహల్లి అనే వ్యక్తి కర్ణాటక గవర్నర్ థావర్చంద్ గెహ్లాతు అధికారికంగా ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయంపై కర్ణాటక పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ మాట్లాడుతూ రాహుల్ ఖర్గే దరఖాస్తు ప్రకారం అర్హతలు పరీక్షించిన తరువాతే మెరిట్ ఆధారంగా భూమి కేటాయించినట్లు పేర్కొన్నారు.



కొంతకాలంగా కర్ణాటక రాజకీయాల్లో ముడా స్కామ్ కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో చిక్కుకున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.